సాక్షి
పార్వతీపురం మన్యం
సోమవారం । 19 । మే । 2025



రైల్వేశాఖ నిర్లక్ష్యం

జిల్లా నుంచి మామిడి ఎగుమతులకు రైల్వేశాఖ మోకాలడ్డుతోంది. ప్రత్యేక బోగీలు కేటాయించకుండా రైతులు, వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. - 8లో



శ్యామలాంబ పండగ ప్రారంభం

శ్యామలాంబ అమ్మవారి ఉత్సవం కనులపండువగా ప్రారంభమైంది. ఆదివారం ఉయ్యాలకంబాల వేడుకను పెదకోమటిపేట గద్దె వద్ద సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. - 8లో



నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మశీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈఏపీసెట్–2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు సోమవారం ప్రారంభం కానున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

మలేరియా నియంత్రణకు కచ్చితమైన ప్రణాళిక


కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: మలేరియా నియంత్రణకు కచ్చితమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులకు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. జూన్, జూలై, ఆగస్టు నెలల్లో మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో 248 గ్రామాలను మలేరియా ప్రభావిత గ్రామాలుగా గుర్తించినట్టు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో మలేరియా నియంత్రణ చర్యలు ముమ్మరం చేయాలన్నారు. వర్షాకాలం ముందు తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ

పాలకొండ రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు సోమవారం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని డిప్యూటీ డీఈఓ పల్రి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

వివాహిత ఆత్మహత్య

మధురవాడ: పిల్లాడిని చూసుకునే విషయంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్నపాటి వివాదం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. బక్కన్నపాలెం ఎస్సీ కాలనీలోని భూలోకమాత ఆలయం వెనుక నివాసం ఉంటున్న కల్యాణ పార్వతి (25) ఆత్మహత్య చేసుకుంది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం భూర్జ గ్రామానికి చెందిన కల్యాణ గణేష్, అదే మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పార్వతి ప్రేమించుకున్నారు. పెద్దల సమక్షంలో 2020లో సీతానగరం చర్చిలో వివాహం చేసుకున్నారు. బతుకుతెరువు కోసం కొంతకాలం కిందట మధురవాడకు వచ్చి, బక్కన్నపాలెంలో నివాసం ఉంటున్నారు. గణేష్ పీఎంపాలెం ఆఖరి బస్టాప్ సమీపంలోని ఎల్ అండ్‌టీ కన్‌స్ట్రక్షన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. వీరికి నాలుగేళ్ల గగన్‌తో పాటు రెండు నెలల బాబు ఉన్నాడు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో గణేష్ పని నుంచి ఇంటికి వచ్చి భోజనం చేసి విశ్రాంతి తీసుకోవడానికి ఉపక్రమించాడు. ఆ సమయంలో భార్య రెండు నెలల బాబును అతని పక్కన పడుకోబెట్టింది. దీంతో గణేష్ తాను ఉదయం నుంచి అన్ని పనులతో పాటు వంట కూడా చేశానని.. బాబును చూసుకోవాలని భార్యతో చెప్పాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో పార్వతి ఇంటి లోపలికి వెళ్లి తలుపు గడియ పెట్టుకుంది. గతంలోనూ ఇలాంటి చిన్న చిన్న గొడవలు జరిగినప్పుడు ఆమె ఇలాగే లోపలికి వెళ్లి గడియ పెట్టుకునేదని, పడుకుందనుకుని గణేష్ పిల్లలతో పాటు బయటే ఉన్నాడు. సాయంత్రం ఆరు గంటలైనా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన గణేష్ తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లాడు. అక్కడ సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని విగతజీవిగా పడి ఉన్న భార్యను చూసి షాక్‌కు గురయ్యాడు. పీఎంపాలెం పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ భాస్కరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ప్చ్..జీడి దిగుబడి!

- ఆలస్యంగా వచ్చిన వర్షాలతో భారీగా తగ్గిన ఉత్పత్తి
- కొనుగోలు కేంద్రాలు లేక అవస్థలు
- ధర అనుకూలించినా..దిగుబడి లేక గిరిజనుల దిగాలు

ఎండనక.. వాననక.. రాయనక.. రప్పనక కొండకోనల్లో సంచరించే గిరిజనులు ఏడాది పాటు కాయకష్టం చేసినా పంట దిగుబడి లేక దిగాలుగా ఉన్నారు. మార్కెట్‌లో ధర ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు లేక..ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ తట్టుకోలేక సతమతమవుతున్నారు. సగానికి సగం పడిపోయిన జీడి దిగుబడితో గుండెలు అదిమిపెట్టి రోదిస్తున్నారు.

భామిని:

ఏజెన్సీ గిరిజనులకు వార్షికాదాయం అందించే ప్రధాన పంటల్లో జీడి ఒకటి. ఏడాది మొత్తం కాపు కాసే సమయం వరకు అష్టకష్టాలు పడగా జీడి పంట చేతికి వచ్చే సరికి నానా అవస్థలు పడడం గిరిజనులకు అలవాటుగా మారింది. ఈ ఏడాది గతంలో కన్నా వర్షాలు ఆలస్యంగా పడడంతో పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది. వచ్చిన పంట కూడా నాణ్యతా లోపంతోనే ఉంది. గతంలో వచ్చిన దిగుబడిలో సగానికి పడిపోయిందని గిరిజనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుడు 15వేలు.. ఇప్పుడు 10వేల టన్నులు

పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 20వేల ఎకరాల్లో జీడి తోటలున్నాయి. గతంలో జిల్లాలో సుమారు 15వేల టన్నుల వరకు దిగుబడి వచ్చేది. ప్రస్తుతం పంట దిగుబడి తగ్గింది. 10 వేల టన్నులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని అంచనా. గతంలో ఎకరాకి సుమారు 400 కిలోల వరకు దిగుబడి వచ్చేదని గిరిజనులు చెబుతున్నారు. ప్రస్తుతం దిగుబడి బాగా తగ్గింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఎకరాకి 280 కిలోల జీడి పిక్కల దిగుబడి పడిపోయినట్లు భావిస్తున్నారు.

నిరుపయోగంగా వీడీవీకేలు

గిరిజనుల ఇంటికి, వారపు సంతలకు నేరుగా ప్రైవేట్ వ్యాపారులు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. చిరువ్యాపారులు ప్రైవేట్ జీడి ప్యాక్టరీలకే అమ్మకాలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర గిరిజనులకు అందడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. వన్‌ధన్ వికాస్ కేంద్రాలు కూడా పనిచేయడం లేదు. మొదట ఆర్భాటంగా ఏర్పాటు చేసిన వన్‌ధన్ కేంద్రాలు మూలకు చేరాయి. ఐటీడీఏ పరిధిలో 121 వీడీవీకేలున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. అలాగే జీడి పరిశ్రమ నడిపే కేంద్రాలు మూలకు చేరడంతో ముడిసరుకు జీడి సేకరణ సాగడం లేదు.


ఏజెన్సీలో కాపు లేని జీడితోట


మణిగలో మూలకు చేరిన వన్‌ధన్ జీడి ప్రాసెసింగ్ యూనిట్

పార్వతీపురం మన్యం జిల్లాలో జీడి పంట విస్తీర్ణం		
మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఉత్పత్తి (టన్నుల్లో)
సీతంపేట	6,119	3100
కురుపాం	3,644	2,050
జీఎల్‌పురం	2,693	1550
జియ్యమ్మవలస	493	950
సాలూరు	1422	750
వీరఘట్టాం	1266	650
భామిని	958	450
కొమరాడ	825	430
మక్కువ	596	350
పార్వతీపురం	780	410
పాలకొండ	298	180
సీతానగరం	152	95
పాచిపెంట	60	75
గురుగుబిల్లి	31	20
బలిజిపేట	63	41

గణనీయంగా తగ్గిన దిగుబడి



ఐటీడీఏ పరిధిలో జీడి పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. నవంబర్‌లో కురవాల్సిన వానలు జనవరిలో కురవడంతో పంటపై ప్రభావం చూపింది. పూత పూర్తిగా రాలిపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. మొత్తం ఐటీడీఏ పరిధిలో సుమారు 32 వేల ఎకరాల విస్తీర్ణంలో జీడి తోటలున్నాయి. ఏడాదికి 8,932 మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. కానీ వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గి 4,300 మెట్రిక్ టన్నులకు పడిపోయిందని అంచనా వేశాం.

ఎస్వీ గణేష్, పీహెచ్ఓ, సీతంపేట

పెళ్లింట విషాదం

- మరికొన్ని గంటల్లో వివాహం జరగాల్సి ఉండగా వధువు తల్లి మృతి
- గ్రామంలో విషాదఛాయలు

గజపతినగరం: మండలంలోని పాతబగ్గాం గ్రామంలో పెళ్లింట విషాదం అలముకుంది. మరికొన్ని గంటల్లో పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట చావుమేళం మోగింది. వివరాల్లోకి వెళితే.. దత్తిరాజేరు మండలం పాచిలవలస గ్రామానికి చెందిన సైలాడ సన్యాసిరావుకు గజపతినగరం మండలం పాత బగ్గాం గ్రామానికి చెందిన పప్పల గౌరితో వివాహం కుదిరింది. ఆదివారం రాత్రి ఒంటి గంట 32 నిమిషాలకు వివాహం జరగాల్సి ఉంది. ఇంతలో వధువు తల్లి పప్పల పైడమ్మ తన స్వగృహంలో మధ్యాహ్నం 3 గంటలకు పెళ్లి పనులు చేస్తుండగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందింది. దీంతో పాతబగ్గాంలో విషాదఛాయలు అలముకున్నాయి. పెద్దలు వివాహాన్ని వాయిదా వేశారు.


పప్పల పైడమ్మ మృతదేహం

ప్రభుత్వ ఉపాధ్యాయుడి వీరంగం

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడనే విమర్శలు ఇటీవల అధికమయ్యాయి. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలో వెంటనే చేరిపోయి మిగిలిన వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నాడంటూ పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. కుల సంఘాల నేతగా గొప్పలు చెప్పుకుంటూ సొంత రజక కులంలోనే వర్గాలను పోషిస్తున్నాడంటూ మండిపడుతున్నారు. సంబంధిత ఉపాధ్యాయుడిపై ఈనెల 17న రాజాం సర్కిల్ కార్యాలయంలో సొంత కులానికి చెందిన పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఆయన వల్ల వర్గపోరు పెరుగుతోందని, మనశ్శాంతి కరువవుతోందని, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అమ్మా... అందరం కలిసి ఆడుకుంటామంటే సరే అన్నారు.. అదే పిల్లల చివరి మాట అని ఆ తల్లులకు తెలియదు.. అక్కడే మృత్యువు కాపుకాసి ఉందని గుర్తించలేకపోయారు.. మూడు గంటల పాటు పిల్లలు కనిపించకపోయే సరికి తల్లిడిల్లిపోయారు.. ఊరంతా గాలించారు.. చివరకు కారులో ప్రాణవాయువు అందక విలవిల్లాడుతూ విగత జీవులుగా కనిపించిన పిల్లలను చూసి కుప్పకూలిపోయారు.


చిన్నారుల మృతికి కారణమైన కారు ఇదే..

ద్వారపూడిలో మృత్యుఘోష

- ఒకే సమయంలో నలుగురు చిన్నారుల మృతి
- కారులో చిక్కుకుని ప్రాణాలు విడిచిన పిల్లలు
- శోకసంద్రంగా మారిన సర్వజన ఆస్పత్రి


గుండెలవిసేలా రోదిస్తున్న కుటుంబసభ్యులు


చనిపోయిన పిల్లలు

విజయనగరం క్రైమ్:

సమయం మధ్యాహ్నం 2 గంటలు.. గ్రామంలోని పెళ్లివేడుకలో పెద్దలు, ఆటపాటల్లో చిన్నారులు నిమగ్నమయ్యారు. ఆటలాడుతూ గ్రామ బీసీ కాలనీ నీళ్ల ట్యాంకు వద్ద ఉన్న కారులోకి నలుగురు చిన్నారులు వెళ్లారు. పొరపాటున డోర్లు వేయడంతో లాక్ అయ్యాయి. అంతే.. వారికి ప్రాణవాయువు అందలేదు. కాపాడాలంటూ వారి ఆర్తనాదాలు బయటకు వినిపించలేదు. మూడుగంటల తర్వాత వెతుకుతూ వెళ్లిన పెద్దలకు కొనఊపిరితో కారులో కొట్టుమిట్టాడుతున్న చిన్నారులు కనిపించారు. డోర్లు బద్దలగొట్టి చిన్నారులను బయటకు తీసినా ఫలితం లేకపోయింది. చిన్నారుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కారు రూపంలో మృత్యువు కాటేసింది. విజయనగరం సమీపంలోని ద్వారపూడిలో మృత్యుఘోష వినిపించింది. సర్వజన ఆస్పత్రి ప్రాంగణం శోకసంద్రంగా మారింది.

మాటలకందని విషాదం

అందరూ పదేళ్లలోపు పిల్లలే. కూలి పనులు చేసుకుంటూ తల్లిదండ్రులు వారిని అల్లారు ముద్దుగా సాకుతున్నారు. పిల్లలు ఆడుకుంటేంటే సంబరపడ్డారు. పెళ్లివేడుకలో బిజీ అయ్యారు. ఒకేసారి కారు రూపంలో కంది మణీశ్వరి (6), బూర్లె చారులత (7), పండి ఉదయ్ (7), బూర్లె జాస్రిత(8)ను మృత్యువు కాటేయడంతో కన్నీరుకార్చారు. విగత జీవులుగా మారిన చిన్నారులను పట్టుకుని బోరున విలపించారు.

కడుపుకోత..

మృతిచెందిన చిన్నారుల్లో బూర్లె చారులత, జాస్రిత అక్కాచెల్లెళ్లు. వీరిద్దరూ ఒకే సారి మృతిచెందడంతో తల్లిదండ్రులు ఉమ, ఆనంద్‌లు విషాదంలో మునిగిపోయారు. ఇద్దరు కుమార్తెల మృతదేహాలను పట్టుకుని గుండెలవిసేలా రోదించారు. దేవుడా.. కడుపుకోత మిగిల్చావా అంటూ విలపించారు. సర్వజన ఆస్పత్రి మార్చురీ వద్ద ఉన్న కుమార్తెల మృతదేహాలను చూసిన తల్లి ఓ దశలో సొమ్మసిల్లిపోయింది. ఉదయ్ తల్లిదండ్రులు బుచ్చిబాబు, భవానీ, మణీశ్వరి తల్లిదండ్రులు సురేష్ అరుణలు సైతం బిడ్డల మృతదేహాలను పట్టుకుని రోదించారు.

ఇళ్లమధ్యనే ఘటన...

మృత్యువుకు కారణమైన కారు వీధిలో ఇళ్ల మధ్యనే ఉంది. దాని పక్కగుండానే అందరూ రాకపోకలు సాగించినా.. అందులో ఉన్న చిన్నారులను గుర్తించలేకపోయారు. వారి ఆర్తనాదాలను ఆలకించలేకపోయారు. కారు అద్దాలు నలుపువి కావడం కూడా దీనికి ఓ కారణంగా గ్రామస్తులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్‌ఐ అశోక్ కుమార్, వన్‌టౌన్ ఎస్‌ఐ రామ్‌గణేష్‌లు హుటాహుటిన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్వజన ఆస్పత్రికి వచ్చి మృతుల వివరాలు సేకరించారు.

కారు ఎవరిది?

బీసీ కాలనీ నీళ్ల ట్యాంకు వద్ద ఆగి ఉన్న కారు ఎవరిది..? అక్కడే ఎందుకు పార్క్ చేశారు? డోర్‌కు లాక్ ఎందుకు వేయలేదు అన్న అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ద్వారపూడిలో జరుగుతున్న పెళ్లి వేడుకకు సంబంధించి వైజాగ్ నుంచి ఆ కారు వచ్చినట్టు సమాచారం. కారు ఓనర్, డ్రైవర్ ఒక్కరేనని తెలిసింది. సంబంధిత వ్యక్తిని పోలీసులు ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

విద్యలనగరంలో ఉగ్రజాడ!



- నగరానికి చెందిన సిరాజ్ అరెస్టుతో ఉలిక్కిపడిన జిల్లా
- పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆబాద్‌వీధిలో భయంభయం
- అప్రమత్తమైన పోలీస్ శాఖ
- నిశిత సోదాలు

విజయనగరం/విజయనగరం క్రైమ్:

విజయనగరం.. రాష్ట్రంలోనే సున్నితమైన, శాంతియుతమైన జిల్లా. కళలకు కాణాచి. సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం. వ్యవసాయమే అధికమంది జీవనాధారం. ఇలాంటి జిల్లాలో ఇప్పుడు ఉగ్రజాడ కలకలం రేపుతోంది. విశాఖ పట్టణానికి చేరువగా ఉన్న విజయనగరాన్ని ఉగ్రకార్యకలాపాలకు అనువుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న వార్తలు జిల్లా వాసుల్లో భయాందోళన నింపుతున్నాయి. ఉగ్రభావజాలంతో కూడిన వ్యక్తిని ఇంటిలిజెన్స్ వర్గాలు అరెస్టు చేయడం, ఆయన వద్ద నుంచి బాంబుల తయారీకి వినియోగించే పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. విజయనగరం ఉగ్రవాద చర్యలకు స్థావరంగా మారిందా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

ఆబాద్ వీధిలో భయంభయం..

విజయనగరం కార్పొరేషన్ నడిబొడ్డున ఉన్న ఆబాద్‌వీధికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ (28) ఉగ్రవాద భావజాలంతో పనిచేస్తున్నట్టు తెలంగాణా రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. ఆయన ఇంటిపై శుక్రవారం రాత్రి దాడిచేసి అదుపులోకి తీసుకున్నాయి. రహస్యప్రదేశంలో విచారణ జరిపాయి. ఆయన వద్ద నుంచి బాంబుల తయారీలో వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఆయనను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌లోకి తీసుకున్నాయి. ఈ సమాచారంతో ఆబాద్‌వీధిలో నిశ్శబ్దం ఆవరించింది. స్థానికులు భయంభయంతో గడుపుతున్నారు.

గతంలో ఎన్నడూ చూడని విధంగా...

విజయనగరం జిల్లా చరిత్రలో గతంలో ఎప్పుడూ బాంబు పేలుళ్లు, ముష్కర మూకలదాడులన్న మాటే లేదు. ఇప్పుడు అదే విజయనగరం సిరాజ్ అరెస్టుతో వార్తల్లోకెక్కింది. తెలంగాణ రాష్ట్రం నుంచి కౌంటర్ ఇంటిలిజెన్స్ బృందం నేరుగా విజయనగరం వచ్చి ఆబాద్‌వీధిలో బాంబులను తయారు చేసేందుకు వినియోగించే సోడియం సల్ఫర్, అమ్మోనియం పాస్ఫరేట్, అల్యూమినియం పౌడర్‌తో సిరాజ్‌ను అరెస్టు చేయడం కలకలం రేపుతోంది. ఈ విషయం ఇక్కడి ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించకపోవడం విస్మయం కలిగిస్తోంది.


విజయనగరం ఆబాద్‌వీధిలో సిరాజ్ ఉర్ రెహ్మాన్ ఇల్లు ఇదే..

రక్షణ కుటుంబంలో చీడపురుగు..!

సిరాజ్ తండ్రి పోలీస్ శాఖలో ఏఎస్ఐగా, అన్న య ఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిమగ్నమైన కుటుంబానికి చెందిన వ్యక్తి ఉగ్రభావజాలానికి ప్రేరేపితం కావడం చర్చనీయాంశంగా మారింది. ఆది నుంచి సిరాజ్‌కు విచ్చలవిడితనం ఎక్కువ. తండ్రి మందలించినా పెడచెవిన పెట్టేవాడు. ఎప్పుడు ఇంటికి వస్తాడో.. వెళ్తాడో తెలియదు. మూడులాంతర్ల సమీపంలోని ఓ మొబైల్ షాపు యజమానికి దగ్గర బంధువుగా సిరాజ్‌ను పోలీసులు గుర్తించారు.

దాడులు చేసేందుకేనా?



ఉమ్మడి ఏపీలో 2013లో హైదరాబాద్‌లో ఐఎస్ఐఎస్ సంబంధాలు కలిగిన యాసిన్ భత్కల్, సయ్యద్ షెహెన్ షా తదితర ఏడుగురు ఉగ్రవాదులు ఐసిస్‌తో సంబంధం పెట్టుకుని ఏడుచోట్ల బాంబులు పేల్చి దాదాపు 20 మంది ప్రాణాలు తీశారు. ఇప్పటికీ ఇది మర్చిపోలేని మారణహోమం. ఇప్పుడు అలాంటి దాడికే విజయనగరం వేదికగా పథక రచన చేస్తూ సిరాజ్ పట్టుబడ్డాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్కా ఆధారాలతో ఆబాద్‌వీధిలో ఉర్దూ పాఠశాల ఎదురుగానే నివసిస్తున్న సిరాజ్ ఇంట్లో సోదాలు చేపట్టి పేలుడుపదార్థాలు స్వాధీ నం చేసుకోవడం దీనికి బలం చేకూర్చుతోంది.

ఇంజినీరింగ్ విద్య నభ్యసించిన సమయంలోనే...

సిరాజ్ ఉర్ రెహ్మాన్ 2018 సంవత్సరంలో హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ విద్యనభ్యసించిన సమయంలో అక్కడ బోయగూడలో ఉంటున్న సమీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడినట్టు నిఘావర్గాలు గుర్తించాయి. ఇద్దరూ సౌదీఅరేబియాకు చెందిన ఐఎస్ఐఎస్‌తో సంబంధాలు నెరిపినట్టు తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో ఉన్న సమీర్‌ను పట్టుకోవడంతో విజయనగరంలో ఉన్న సిరాజ్ వ్యవహారం బయటపడింది. కేంద్ర హోంశాఖ ఉత్తర్వులతో కార్డెన్ సెర్చ్, నాకాబందీ నిర్వహించిన పోలీసులకు సమీర్, సిరాజ్‌ల భాగోతం బహిర్గతమైంది. ఇద్దరూ కలిసి బాంబుల తయారీకి పథకరచన చేసినట్టు సమాచారం.

ఎవరికీ అనుమానం రాదనే...

హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు చేసి అల్లర్ల సృష్టించేందుకు సౌదీ అరేబియాలోని ఐఎస్ఐఎస్ నుంచి వచ్చిన ఆదేశాల నేపథ్యంలో సిరాజ్ విజయనగరంలో పేలుడు పదార్థాలు కొనుగోలు చేసినట్టు విచారణలో వెల్లడించినట్టు సమాచారం. వాస్తవానికి ఉత్తరాంధ్రలో విజయనగరం జిల్లా ముందుగుండు సామగ్రి విక్రయాలకు పెట్టింది పేరు. ఇటువంటి వెనుకబడిన ప్రాంతంలో పేలుళ్లకు అవసరమైన పదార్థాలను సులభంగా సేకరించవచ్చని, నిఘా ఉండదని భావించారు. అందులో భాగంగానే సోడియం సల్ఫర్, అమ్మోనియం ఫాస్మరేట్ వంటి పదార్థాలు కొనుగోలుచేసి సిరాజ్ తన ఇంట్లో భద్రపరిచినట్టు తెలుస్తోంది. అయితే, నగరంలోని ఏ దుకాణంలో ఈ పేలుడు పదార్థాలను ఎంత మొత్తంలో కొనుగోలు చేశారు...? వాటి తయారీతో ఎంత మొత్తంలో నష్టం చేకూర్చేందుకు పథకరచన చేశారన్న అంశాలపై నిఘా వర్గాలు విచారణ జరుపుతున్నట్టు తెలిసింది. తెలియని వ్యక్తులకు పేలుడు పదార్థాలు విక్రయిసున్నవారి వివరాలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం.

అదుపులోకి తీసుకున్నాం

ఇంటెలిజెన్స్ సమాచారంతో విజయనగరం ఆబాద్‌వీధిలో ఉగ్రవాద భావజాలంతో ఉన్న సిరాజ్‌ను అదుపులోకి తీసుకున్నాం. అతనితో పాటు హైదరాబాద్‌కు చెందిన సమీర్‌ను కూడా అక్కడి ఇంటెలిజెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ఆదేశాలతో విజయనగరం టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ కృష్ణమూర్తితో కలిసి వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించాం.

– ఎం.శ్రీనివాస్, డీఎస్పీ, విజయనగరం

క్లుప్తంగా

కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె వాయిదా

- జూలై 9న చేపట్టనున్నట్లు వెల్లడి

విజయనగరం గంటస్తంభం: లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట జరగాల్సిన సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా పడినట్లు కేంద్ర కార్మిక సంఘాల నేతలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, ఇఫ్టూ దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశం ఇంత తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్రప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ లేబర్ కోడ్‌ల అమలును దూకుడుగా ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. జూలై 9వ తేదీన సమ్మె జయప్రదం చేసేందుకు సమాయత్తం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆలయంపై పడిన పిడుగు



పిడుగు దాటికి ఊడిన పెచ్చులు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో కాశీమాత ఆలయంలో కొలువైన లక్ష్మీగణపతి ఆలయంపై ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడింది, పిడుగు శబ్దానికి ఆలయం గోపురం పెచ్చులు ఊడిపోయాయి. ఆలయం కింద భక్తులు ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని పొనుగుటివలస గ్రామంలో బొండాడ నారాయణ తమ్ముడి కొడుకు బొండాడ గణేష్ శనివారం రాత్రి పెదనాన్న నారాయణపై వెదురు కర్రతో దాడి చేయడంతో గణేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బొండాడ నారాయణ, బొండాడ గణేష్ కుటుంబాల మధ్య ఉన్న పాత తగాదాల నేపథ్యంలో, శనివారం రాత్రి తాగిన మైకంలో గణేష్ నారాయణపై దాడి చేయడంతో నారాయణ చేతికి గాయమైంది..దీంతో నారాయణ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నారాయణ ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

తివ్వాకొండల్లో ఏనుగుల సంచారం



తివ్వాకొండ చరియల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలం సరిహద్దుగా గల తివ్వాకొండల్లో ఏనుగుల గుంపు తాగునీటి కోసం తహతహ లాడుతోంది. ఈ మేరకు ఆదివారం భామిని-గుమ్మలక్ష్మీపురం మండలాల సరిహద్దుల్లో ఏనుగుల గుంపు పచార్లు కొట్టినట్లు గిరిజనులు తెలిపారు. రాతి గుట్టల్లో నడుస్తూ నీటి కోసం పయనిస్తున్నట్లు చెప్పారు. ఒక పక్క మండు వేసవితో అల్లాడుతున్న పరిస్థితిలో ఏనుగుల గుంపు అవస్థలు పడుతున్నట్లు తెలియజేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



అప్పలనాయుడు మృతదేహం

మెరకముడిదాం: మండలంలోని ఎం.గదబవలస గ్రామానికి చెందిన ఆరంగి అప్పలనాయుడు (42) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆరంగి అప్పలనాయుడు తరచూ మద్యం తాగుతుండడంతో కుటుంబకలహాలు నెలకొన్నాయి, ఈ క్రమంలో మనస్తాపం చెందిన అప్పలనాయుడు ఆదివారం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుదరాయవలస ఎస్సై జె.లోకేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి అప్పలనాయుడు మృతికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

రైల్వేశాఖ నిర్లక్ష్యం

- ఈ ఏడాదీ మామిడి ఎగుమతులు నిల్
- కిసాన్ రైళ్లకు ప్రాధాన్యం కల్పించని అధికారులు
- అధిక మొత్తంలో డబ్బులు చెల్లించలేక.. ప్రత్యామ్నాయ మార్గాల వైపు రైతులు
- సాధారణ రైళ్ల కైనా... డిస్కౌంట్ లిచ్చి నడపని అధికారులు
- తూతూ మంత్రంగా ఎగుమతిదారులతో మంతనాలు
- నష్టాలబాట పట్టలేక రోడ్డు రవాణా వైపే రైతుల మొగ్గు



గూడ్స్ ద్వారా మామిడి ఎగుమతులు అవుతున్న దృశ్యం (ఫైల్)

విజయనగరం టౌన్: మామిడి ఎగుమతులనుద్దేశించి విజయనగరం ఖ్యాతిని దేశ ప్రధాని మోడీ ప్రస్తుతించిన సంగతి తెలిసిందే. అటువంటి మామిడి ఎగుమతులపై రైల్వేశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో గతేడాది ఎగుమతుల్లేకుండా పోయాయి. ఈ ఏడాది కూడా పంట పూర్తయిపోయి, ఇతర మార్గాల గుండా వెళ్లిపోతున్నప్పటికీ అధికారులు ఏమాత్రం చలించకపోవడం గమనార్హం. సంబంధిత మేంగో అసోసియేషన్‌లతో తూతూమంత్రంగా సంప్రదింపులు చేసి వదిలేయడంతో వ్యాపారస్తులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టిసారించాల్సిన పరిస్థితి నెలకొంది. ఏమాత్రమైనా వ్యాపారస్తులకు అవకాశం కల్పించి, రాయితీలిచ్చినట్లయితే ఈ ఏడాదైనా మామిడి పంట రైళ్ల ద్వారా వెళ్లేది. కానీ కేవలం నిర్లక్ష్యం కారణంగానే కోట్లాది రూపాయలను రైల్వేశాఖ నష్టపోయిందనడంలో అతిశయోక్తిలేదు.

ఏడాదికోమారు పండే మామిడి పంటను ఢిల్లీ, ముంబై వంటి ప్రాంతాలకు రైల్వే ద్వారా ఎగుమతులు చేస్తూ ఎంతో కొంతమేర రైతులు లాభాన్ని చూద్దామనుకుంటుంటారు. అయితే చద్దన్నం కన్నా ఊరగాయ ఖర్చే ఎక్కువ అన్న చందాన ప్రస్తుతం రైతుల పరిస్థితి ఉంది. విజయనగరం జిల్లా వ్యాప్తంగా మామిడి పంటను రైతన్నలు బుట్టలు కట్టి, ప్యాకింగ్‌లు చేసి రైల్వే ద్వారా ఇతర ప్రాంతాలకు పంపించే మేంగో అసోసియేషన్‌కు అమ్మకాలు చేపట్టడమే కాకుండా దగ్గరుండి బుట్టలను రైలుపెట్టెల్లో సర్ది మరీ పంపిస్తుంటారు. అయితే గతేడాది కూడా రైల్వేశాఖ నిర్లక్ష్యం కారణంగానే మామిడి ఎగుమతుల్లేకుండా పోయాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి తలెత్తింది. కేవలం అధిక లభార్జనే ధ్యేయంగా రైల్వేశాఖ పనిచేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సాధారణ ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ల టికెట్ల ధరలను రైల్వేశాఖ పెంచేసింది. జనరల్ బోగీలతో పాటు స్లీపర్ క్లాస్‌లను కుదించేసింది. ఏసీ బోగీలకు ప్రాధాన్యం కల్పించి సామాన్యుడి నడ్డి విరగ్గొట్టింది. మామిడి ఎగుమతులను కరోనా వంటి విపత్కర సమయంలోనూ కిసాన్ రైళ్లను ప్రవేశపెట్టి రైతులకు వెన్నుదన్నుగా నిలబడిన రైల్వేశాఖ కరోనా తర్వాత సగం ధరకే వచ్చే కిసాన్ రైళ్లకు స్వస్తిపలికింది. దీంతో సరైన పంటలేక, చాలీచాలని లోడ్‌లను వ్యాపారస్తులు నలుగురైదుగురు కలిసి రైళ్ల ద్వారా పంపిద్దామంటే కిసాన్ రైళ్లు లేకుండా పోయాయి. సాధారణ గూడ్స్ ద్వారా పంపిద్దామంటే నాలుగైదు బోగీలే తప్ప మిగతావన్నీ ఖాళీగానే వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. కానీ ప్రతి బోగీకి డబ్బులు చెల్లించాల్సిందే. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది. దానిమూలంగా ప్రత్యామ్నాయమార్గాలవైపు వ్యాపారులు దృష్టిసారించారు. ఉన్నతాధికారుల బాధ్యతా రాహిత్యం కారణంగానే రెండేళ్లుగా మామిడి ఎగుమతుల్లేకుండా పోయాయని పలువురు వ్యాపారస్తులు అభిప్రాయపడ్డారు.

మేంగో అసోసియేషన్‌లతో సమావేశం నిర్వహించాం

ఈ ఏడాది మామిడి పంటను ఎగుమతులు చేసే విధంగా చూడాలని మేంగో అసోసియేషన్‌లతో సమావేశాన్ని నిర్వహించాం. అయితే పంట తక్కువ ఉందన్న కారణంగా వారంతా సుముఖత చూపించలేదు. పైగా కిసాన్ రైళ్లు, రాయితీలు కావాలని అడుగుతున్నారు. దీనిపైన ఉన్నతాధికారులకు నివేదించాం. జనరల్ బోగీలను ఇస్తామన్నాం. సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

– బి. వెంకట సత్యనారాయణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, విజయనగరం

అవసరం మేరకు అడిగాం

రైల్వేశాఖ ద్వారా ఏటా మామిడి ఎగుమతులు రాయితీపై పంపించేవారం. కిసాన్ రైళ్లను అందించలేదు. జనరల్ బోగీల ద్వారా ఎగుమతులు చేసేందుకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయి. రోడ్డు రవాణా ద్వారా మామిడి ఎగుమతులును నేరుగా స్టాక్ పాయింట్‌కే పంపించేస్తున్నాం. దీనివల్ల ఖర్చు తగ్గింది. రైల్వే అధికారులు కొంచెం ప్రాధాన్యం కల్పించి, రాయితీలు కల్పించి ఉంటే బాగుండేది.

– ముదునూరి నారాయణమూర్తి రాజు, మేంగో అసోసియేషన్ ప్రతినిధి, విజయనగరం

కనులపండువగా శ్యామలాంబ పండగ ప్రారంభం



ఉయ్యాలకంబాల ఉత్సవంలో యువరాజు తదితరులు



తోపులాటతో ఇబ్బందులకు గురై బయటకు వస్తున్న యువరాజు



మెంటాడ వీధిలో ఉన్న వీరభద్రుని ప్రభ

సాలూరు: శ్యామలాంబ అమ్మవారి ఉత్సవం కనులపండువగా ప్రారంభమైంది. ఆదివారం ఉయ్యాలకంబాల వేడుకను పెదకోమటిపేట గద్దె వద్ద సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. గద్దె వద్ద ఏర్పాటుచేసిన ఉయ్యాలలో జమిందార్ కుటుంబానికి చెందిన విక్రమచంద్ర సన్యాసి రాజు, తదితరులను ఉయ్యాలలో కూర్చోబెట్టి పెద్దలు ఊపారు. వేలాది మంది భక్తులు ఈ వేడుకను తిలకించేందుకు తరలివచ్చారు. స్వల్ప తోపులాట నేపథ్యంలో యువరాజు, పెద్దలు కొంత ఇబ్బందిపడ్డారు. కార్యక్రమంలో స్త్రీశిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పీ భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తొల్లేళ్ల ఉత్సవం

సోమవారం తొల్లేళ్ల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జన్నివీధిలో ఉన్న అమ్మవారి గద్దె నుంచి ఘటాను గొల్లవీధి వాసులు తీసుకొస్తూ కర్రలతో సాము చేస్తారు. ఒక వీధి తరువాత మిగిలిన వీధి వాసులంతా ఈ ఉత్సవంలో పాల్గొని ఘటాలను ఊరేగిస్తారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ మాధవరెడ్డి

పండగ నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఆదివారం పట్టణానికి వచ్చిన ఆయన సిరిమాను తిరిగే ప్రాంతాలు, పార్కింగ్ తదితర అంశాలపై ఆరా తీసి అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించారు.

ఇబ్బందులు పడిన పోలీసులు

సుమారు వెయ్యి మంది పోలీసులు ఈ ఉత్సవానికి బందోబస్తు నిమిత్తం వచ్చారు. అయితే బందోబస్తు పోలీసులకు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అక్కడ విద్యుత్ వెలుగులు లేకపోవడంతో చీకట్లో పోలీసులు భోజనాలు చేయడం కనిపించింది. సెల్‌ఫోన్ లైట్లు వేసుకుని, అటుగా వచ్చే వాహనాల వెలుతురు మధ్య పలువురు పోలీసులు భోజనాలు చేస్తూ ఇబ్బందులు పడ్డారు.



కంట్రోల్‌రూమ్ నుంచి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



చీకట్లో భోజనాలు చేస్తున్న పోలీసులు

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు



చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: చెస్‌అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు స్పందన లభించింది. రింగ్‌రోడ్‌లో ఉన్న ఫైర్ చెస్ స్కూల్లో అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో అండర్-7,9,11,13 విభాగాలతో పాటు ఓపెన్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో రాజాంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలను వి.వెంకటేష్, ధనలక్ష్మి, పద్మావతి, అర్చనలు పర్యవేక్షించారు.

కిడ్నాపైన వివాహిత హత్య



హత్యకు గురైన వెంకటలక్ష్మి (ఫైల్)

బావిలో మృతదేహాన్ని తీస్తున్న పోలీసులు, బావివద్దకు చేరుకున్న గ్రామస్తులు

- బావిలో లభ్యమైన మృతదేహం
- ఉలిక్కిపడిన గ్రామస్తులు

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన వివాహిత కిడ్నాప్‌కు గురికావడం..ఆపై ఆమె మృతదేహం బావిలో లభ్యం కావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్రాప్రగడ వెంకటక్ష్మి (38) శనివారం రాత్రి 10 గంటల సమయంలో కుమార్తె రిషితతో కలిసి బహిర్భూమికి వెళ్లింది. కొద్ది సేపటి తర్వాత రిషిత ఇంటికి వచ్చి ఎవరో గుర్తుతెలియని కొందరు వచ్చి అమ్మను ఆటోఎక్కించి తీసుకెళ్లిపోయారని, తనను పక్కకు తోసేశారని తండ్రి సత్యనారాయణ, అన్నయ్య హరీష్‌కు చెప్పగా వారు పరిసర గ్రామాలకు బైక్‌లతో వెళ్లి వెతికినప్పటికీ ఆచూకీ తెలియక పోవడంతో వెంటనే పోలీసులకు హరీష్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కిడ్నాప్ అయిన వివాహిత ఆచూకీ కోసం సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించారు. ఆదివారం ఉదయం డాగ్‌స్క్వాడ్‌తో ఆచూకీ కోసం ప్రయత్నిస్తుండగా గ్రామసమీపంలోని బావిలో మహిళ మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. వెలికితీసిన మృతదేహాన్ని వెంకటలక్ష్మిగా గుర్తించడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించి వివరాలు సేకరించారు.

గంజాయి పీలుస్తున్న వ్యక్తి అరెస్ట్



గంజాయితో పాటు పోలీసులు పట్టుకున్న వ్యక్తి

నెల్లిమర్ల: గంజాయి పీలుస్తూ పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై బి.గణేష్. తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ నారాయణపట్నం బ్రిడ్జి దగ్గర ఉన్న రైల్వే ట్రాక్ ప్రాంతంలో ఒక వ్యక్తి అక్రమంగా గంజాయి కలిగి ఉండి పీలుస్తున్నాడన్న సమాచారంపై సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే జరజాపు పేటకు చెందిన యశ్వంత్ అనే వ్యక్తి వద్ద 100 గ్రాముల గంజాయి, గంజాయి పీల్చడానికి ఉపయోగించే పరికరాలను సీజ్ చేసి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. నిందితుడు గడిచిన ఆరేడు సంవత్సరాల నుంచి గంజాయి వినియోగిస్తున్నాడని, ఒడిశా రాష్ట్రంలోని రాయగడ రైల్వేస్టేషన్ ప్రాంతంలో కొనుక్కుని ఇక్కడికి తీసుకొని వచ్చి వినియోగిస్తున్నట్లు విచారణలో చెప్పినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి వినియోగించినా.. గంజాయి కలిగి ఉన్నా, ఏ రూపంలో అయినా గంజాయికి సంబంధించి కార్యక్రమాల్లో పాలుపంచుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గణేష్ హెచ్చరించారు. గంజాయి గురించి సమాచారాన్ని ఫోన్ 912110944 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. దాడుల్లో సిబ్బంది దామోదర్ రావు, వీఆర్వో వెంకటలక్ష్మి, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరు కాకున్న 15,390 మంది విద్యార్థులు
- 5 పరీక్ష కేంద్రాల ఏర్పాటు



విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ) సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రెండు రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనుండగా ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. జేఎన్‌టీయూ కాకినాడ భాగస్వామ్యంతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు 15,390 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో ఇంజినీరింగ్ పరీక్షలకు 11,085మంది, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 4,280మంది రెండూ కలిపి రాస్తున్న విద్యార్థులు 25 మంది ఉన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాలను కలుపుకుని మొత్తం 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరగనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పరీక్షా కేంద్రాలు

- ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు హాజరుకానున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతాలకు చెందిన 3,993 మంది విద్యార్థుల కోసం రాజాంలోని జీఎంఆర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. వారిలో ఇంజినీరింగ్ పరీక్ష కోసం 2,873 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 1114 మంది, రెండూ కలిపి రాసేవారు ఆరుగురు ఉన్నారు.
- విజయనగరం జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన 8,212 మంది విద్యార్థుల కోసం పట్టణంలోని నాలుగు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఇంజినీరింగ్ పరీక్ష కోసం 8,212 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ 3,166 మంది రెండూ కలిపి రాసే వారు 19 మంది ఉన్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో పట్టణ శివారులో ఉన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సీతం ఇంజినీరింగ్ కళాశాల, లెండి ఇంజినీరింగ్ కళాశాల, అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఉన్నాయి.

విద్యార్థులు వీటిని వెంట తీసుకెళ్లాలి

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన ఏపీ ఈఏపీ సెట్-2025 దరఖాస్తు ప్రింటవుట్ కాపీలో పొందుపర్చిన నిర్ణీత బాక్స్‌లో విద్యార్థి కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించి, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.
- పరీక్ష జరిగే రోజున సదరు ప్రింటవుట్ కాపీతోపాటు హాల్ టికెట్ వెంట తీసుకుని వెళ్లాలి. బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను అనుమతిస్తారు. గుర్తింపు కోసం ఇంటర్మీడియట్ హాల్ టికెట్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి ఒరిజినల్ తీసుకు వెళ్లాలి. ఇవి మినహా ఇతర వస్తువులను అనుమతించరు.
- విద్యార్థి ఫొటో అతికించిన ఆన్‌లైన్ దరఖాస్తు కాపీపై పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేసి, ఎడమ చేతి బొటనవేలి ముద్ర వేయాలి.

కేంద్రాల వద్ద తనిఖీలు

ఏపీ ఈఏపీ సెట్‌కు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2 గంటల వరకు అనుమతిస్తారు. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష జరిగే రోజున కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల దగ్గర తనిఖీలతోపాటు బయోమెట్రిక్ హాజరు నమోదు, సంతకం చేయాల్సి ఉన్నందున చివరి నిమిషంలో హడావుడి పడకుండా చూసుకోవాలి.

రోడ్డు పక్కన చెట్ల నరికివేత



రహదారి పక్కన మొదళ్ల వరకు నరికివేసిన నీడనిచ్చే చెట్లు

గరుగుబిల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ప్రభుత్వాలు, ఎన్‌జీఓ సంఘాలు కోరుతుంటే విద్యుత్ శాఖ అధికారుల తీరుమాత్రం దానికి భిన్నంగా ఉంది. గరుగుబిల్లి మండలంలోని గొల్లవానివలస నుంచి దళాయివలస జంక్షన్ వరకు విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనుల నిమిత్తం రహదారికి ఒకవైపు ఉన్న దాదాపు 50 చెట్లను నిర్దాక్ష్యంగా చెట్ల మొదళ్ల వరకు నరికివేయడంతో విద్యుత్‌శాఖ సిబ్బంది తీరుపట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన గాలి, పాదచారులకు నీడనిచ్చే చెట్లను మళ్లీ బతికేందుకు వీలులేకుండా నరికివేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల వయస్సు గల చెట్లను ఇంత నిర్లక్ష్యంగా విద్యుత్ పనులకు ఆటంకంగా ఉన్నాయని నెపంతో ఈ విధంగా చేయడం సరికాదని అభిప్రాయ పడుతున్నారు. వీలైనంత మేరకు విద్యుత్ శాఖ వారి పనులకు అడ్డంకిగా ఉంటే కొమ్మలను తొలగించాలే తప్ప చెట్లను నరికివేయడం సరికాదని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ చెట్లు నరికి వేసిన చోట బాధ్యతగా మొక్కలు నాటాలని కోరుతున్నారు.